సాక్షి
మహబూబాబాద్
మంగళవారం | 28 | జనవరి | 2025



రిజర్వేషన్ల హామీ ఏమైంది..?

బీసీలకు 'స్థానిక' ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చి ఏడాదైనా స్పష్టత లేదని శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ అన్నారు. - 8లో▸



కూలీ పనికి వెళ్లివస్తూ..

కూలీ పనికి వెళ్లివస్తుండగా ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో 13 మంది గాయపడ్డారు. అందులో ఒకరు మృతి చెందారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
36.1°/16.7°

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఉంటుంది. రాత్రివేళ చలితో పాటు మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

నేడు 'డయల్ యువర్ డీఎం'

నెహ్రూసెంటర్: మహబూబాబాద్ ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో మంగళవారం 'డయల్ యువర్ డీఎం' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ ఎం.శివప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మధ్యాహ్నం 12నుంచి 1గంట వరకు కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ఆర్టీసీ అభివృద్ధికి సలహాలు, సూచనలు ఇచ్చేందుకు ప్రజలు, ప్రయాణికులు 85003 24880 నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు.

నేటి నుంచి 31వరకు రైల్వేగేటు మూసివేత



గార్ల: గార్ల–డోర్నకల్ మధ్యలోని రైల్వేగేటును ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనుల దృష్ట్యా నేటి నుంచి ఈనెల 31వ తేదీ వరకు మూసివేస్తున్నట్లు రైల్వే ఉన్నతాధికారులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మం, మహబూబాబాద్ వెళ్లే ఆర్టీసీ బస్సులు, వాహనదారులు గమనించి ప్రత్యామ్నాయ రహదారుల మీదుగా రాకపోకలు కొనసాగించాలని వారు పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద్ అర్బన్: పోస్ట్ మెట్రిక్, ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల కోసం ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ, ఈబీసీ విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి ఎం.నర్సింహస్వామి సోమవారం తెలిపారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో సంబంధిత వెబ్‌సైట్‌లో ఈ నెల 31వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. 2022–23, 2023–24 విద్యా సంవత్సరానికి గాను కళాశాలల యాజమాన్యాలు విద్యార్థుల హార్డ్ కాపీలను కార్యాలయంలో అందజేయాలన్నారు. స్కాలర్‌షిప్‌ల మంజూరు కోసం కళాశాలల ప్రిన్సిపాళ్లు యుటిలైజేషన్ సర్టిఫికెట్లు కూడా అందించాలన్నారు.

..మెగా జాబ్‌మేళా

మహబూబాబాద్ అర్బన్: సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ఏటూరునాగారం ఆధ్వర్యంలో ఈ నెల 28న జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉదయం 10:30 గంటలకు మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి గుగులోత్ దేశీరాంనాయక్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ, ఐటీఐ, డిప్లొమా, ఏఎన్‌ఎం, జీఎన్‌ఎం, బీ–ఫార్మసీ, డీ–ఫార్మసీ, ఎంఫార్మసీ, ఎంబీఏ, బీటెక్ కోర్సులు పూర్తి చేసిన గిరిజన విద్యార్థులు మెగా జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ఆసక్తిగల విద్యార్థులు తమ బయోడేటా, విద్యార్హతల జిరాక్స్ పత్రాలతో హాజరు కావాలన్నారు. పూర్తి వివరాలకు 8008932159, 7981633716 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

నేడు జిల్లాస్థాయి క్విజ్ పోటీలు


మహబూబాబాద్ అర్బన్: రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా మానుకోట మున్సిపల్ పరిధిలోని అనంతారం మోడల్ స్కూల్‌లో జిల్లాస్థాయి క్విజ్ పోటీలు మంగళవారం ఉదయం 10గంటలకు నిర్వహించనున్నట్లు డీఈఓ రవీందర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతీ పాఠశాల నుంచి ఒక విద్యార్థికి మాత్రమే అవకాశం ఉందని, ఈ అవకాశాన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు జిల్లా సైన్స్ అధికారి అప్పారావు 98495 98281 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలన్నారు.

ఏఎన్‌ఎంలకు డ్రెస్‌కోడ్, ఐడీ కార్డులు

ఏటూరునాగారం: ఐటీడీఏ ఏటూరునాగారం పరిధి ములుగు, భూపాలపల్లి జిల్లాలోని ఆశ్రమ పాఠశాలల్లో పనిచేసే ఏఎస్‌ఎంలకు ప్రత్యేక డ్రెస్‌కోడ్‌ను అందించనున్నారు. అంతేకాకుండా వారికి గుర్తింపు కార్డులను అందించేలా తగిన ఏర్పాట్లు చేశారు. ములుగు జిల్లాలో 41, భూపాలపల్లి జిల్లాలో 13 ఆశ్రమ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో విద్యార్థులకు ఏదైనా అనారోగ్య సమస్య వస్తే వెంటనే ప్రథమ చికిత్స అందించడానికి ఐటీడీఏ ద్వారా 54 మంది ఏఎన్‌ఎంలను గతంలోనే నియమించారు. వారికి సాధారణమైన సివిల్ దుస్తులు ఉండేది. దీంతో వారి ప్రాముఖ్యతను గుర్తించడానికి వీలు లేకపోవడంతో.. ప్రత్యేకమైన డ్రెస్ కోడ్ (ఆప్రాన్)తో పాటు ఐడీ కార్డులను అందించడానికి పీఓ చిత్రామిశ్రా ప్రత్యేక చొరవ చూపుతున్నారు. పాఠశాలలో విధులు నిర్వర్తించే క్రమంలో హుందాతనం ఉట్టిపడేలా తయారు చేయించారు. వీటిని రెండు, మూడు రోజుల్లో సంబంధిత ఏఎన్‌ఎంలకు అందించనున్నట్లు ఐటీడీఏ పీఓ తెలిపారు.

నీరు కలుషితం

- పెరుగుతున్న ఫ్లోరైడ్, నైట్రేట్ శాతం
- మోతాదుకు మించి పీహెచ్ గాఢత
- ఎరువులు, పురుగుల మందుల వాడకమే కారణం
- అదుపు చేయకపోతే ప్రమాదకరమే..



సాక్షి, మహబూబాబాద్: పంటల సాగులో అనేక మార్పులు వచ్చాయి. రైతులు ఆధునిక పద్ధతుల్లో పంటలను పండించి లాభాలు గడిస్తున్నారు. అయితే ఈక్రమంలో నేలతో పాటు నీరు కలుషితం అవుతున్నాయి. అలాగే ఎరువులు, పురుగు మందులు వాడకం పెరగడంతో వ్యవసాయోత్పత్తులు విషమయంగా మారుతున్నాయి. ముఖ్యంగా భూగర్భ జలాలు కలుషితం అవుతున్నాయని తేలింది. ఇటీవల కేంద్ర జలమండలి భూగర్భ జలాల నాణ్యతపై విడుదల చేసిన వార్షిక నివేదికలో జిల్లాలోని భూగర్భ జలాలు కలుషితం అవుతున్నాయనే నిజాన్ని చెప్పింది.

ఖనిజ లవణాల పరీక్ష..

కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లా భూగర్భ జలాల శాఖ ఆధ్వర్యంలో నీటిలో కరిగి ఉన్న ఖనిజ లవణాలను పరీక్షించారు. ప్రాధానంగా పీహెచ్ గాఢత, కాఠిన్యం, మెగ్నీషియం, కాల్షియం, కాపర్, ఐరన్, మాంగనీస్, క్లోరైడ్, సల్ఫేట్, నైట్రేట్, ఫ్లోరైడ్, అర్సినిక్, పాదరసం మొదలైన ఇతర ఖనిజ లవణాల శాతం లెక్కించారు. అయితే జిల్లాలోని అత్యధికశాతం ప్రాంతాలు, మున్నేరు, పాలేరు, ఆకేరు వాగుల పరీవాహకం, అడవులు, సాగునీరందించే ఎస్సారెస్పీ కాల్వలు ఉండటంతో సాధారణ ఖనిజాలు నిర్ణీత స్థాయిని మించి లేవని వారు తేల్చారు.

పొంచి ఉన్న ముప్పు

భూగర్భ జలాల్లోని ఫ్లోరైడ్, నైట్రేట్ ఖనిజాలు కొన్నిచోట్ల సాధారణ స్థాయికి మించి ఉన్నట్లు తేలింది. కాగా లీటర్ నీటిలో నైట్రేట్ 1.5 మిల్లీ గ్రాముల లోపు ఉండాలి. కానీ జిల్లాలోని డోర్నకల్ మండలం పెరుమాండ్ల సంకీసలో 3.25 మిల్లీ గ్రాములు, మహబూబాబాద్ రూరల్ మండలంలోని వీఎస్ లక్ష్మీపురం గ్రామంలో 5.30 మిల్లీ గ్రాములు, మల్యాలలో 4.95 మిల్లీ గ్రాములు, నర్సింహులపేట మండలం జయపురం గ్రామంలో 4.04 మిల్లీ గ్రాములు, కౌసల్యాదేవిపల్లి గ్రామంలో 4.01 మిల్లీ గ్రాములు ఉన్నట్లు పరీక్షల్లో తేలింది. అదేవిధంగా జీరో నుంచి 40 మిల్లీ గ్రాములు ఉండాల్సిన నైట్రేట్ శాతం పలుచోట్ల ప్రమాదకరంగా ఉంది. ముఖ్యంగా మహబూబాబాద్ మండలం పర్వతగిరి తండాలో 134 మిల్లీ గ్రాములు, డోర్నకల్ మండల కేంద్రంలో 78 మిల్లీ గ్రాములు, కురవి మండలం ఉప్పరిగూడెంలో 120 మిల్లీ గ్రాములు ఉన్నట్లు తేలింది. 6.5 నుంచి 8.5 వరకు ఉండాల్సిన పీహెచ్ స్థాయి పలుచోట్ల పెరుగుతుందని, 1500లోపు ఉండాల్సిన టీడీఎస్ కొన్నిచోట్ల పెరిగిందని అధికారులు చెప్పారు. ఇలాగే పెరిగితే ప్రజారోగ్యంపై ప్రభావం పడుతుందని డాక్టర్లు, శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

ఎరువులు, రసాయనాలతోనే..

ఇతర జిల్లాలతో పోలిస్తే మానుకోట జిల్లాలో అడవులు ఎక్కువగా ఉండటంతో కాలుష్య ప్రభావం తక్కువగానే ఉంటుంది. అయితే పట్టణీకరణలో భాగంగా గత పది సంవత్సరాల్లో జిల్లాలోని మహబూబాబాద్, తొర్రూరు, మరిపెడ ప్రాంతాలతో పాటు పలు ప్రాంతాల్లో జనం సాంద్రత పెరిగింది. దీనికి అనుగుణంగా ద్విచక్రవాహనాలు, ఆటోలు, కార్ల సంఖ్య రెట్టింపు అయింది. దీంతో వాటి నుంచి విడుదలయ్యే కార్బైడ్స్ అధికంగా గాలిలో కలిసి ఊపిరితిత్తుల, గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వారి సంఖ్య పెరిగింది. అదేవిదంగా జిల్లాలో చిన్న చిన్న కమతాల్లో ఎక్కువగా మిర్చి, పత్తి వంటి వాణిజ్య పంటలు, పెరిగిన వరి సాగులో వాడే ఎరువులు, క్రిమిసంహారక మందులతో ముందు నీరు కలుషితం కావడం, ఆ నీరు భూగర్భంలోకి ఇంకిపోయి లోపల కూడా కలుషితం చేస్తున్నాయి. ఇటువంటి పరిస్థితిలో సేంద్రియ వ్యవసాయం వైపు రైతులు దృష్టిసారించకపోతే రాబోయే తరాలకు కలుషిత నీరే దిక్కుగా మారే ప్రమాదం ఉందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

నీటి కాలుష్యాన్ని అరికట్టాలి



గతంతో పోలిస్తే జిల్లాలో రసాయనాలు, ఎరువుల వాడకం ఎక్కువైంది. దీంతో భూగర్భజలాల్లో నైట్రేట్, ఫ్లోరైడ్ శాతం పెరుగుతుంది. ఈ పెరుగుదల మంచిది కాదు. ఇందుకు కారణమైన ఎరువులు, పురుగు మందుల వాడకం తగ్గించి రైతులను సేంద్రియ వ్యవసాయం వైపు మళ్లించాలి. రాతి పొరల నుంచి వచ్చే నీటిలో కూడా టీడీఎస్, ఫ్లోరైడ్ వంటి ఖనిజ లవణాలు ఎక్కువగా కలిసే అవకాశం ఉంది. బోరు, బావుల నీరు తాగాల్సి వచ్చినప్పుడు వాటిల్లోని కలిగి ఉన్న ఖనిజ లవణాల పరీక్ష చేయించుకున్న తర్వాతే తాగాలి.

-వి.సురేష్, జిల్లా గ్రౌండ్ వాటర్ అధికారి

మిర్చి కొనుగోళ్లు షురూ..



మిర్చి కొనుగోళ్లను ప్రారంభిస్తున్న మార్కెట్ చైర్మన్, అధికారులు

కేసముద్రం: కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం మిర్చి కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. చైర్మన్ గంట సంజీవరెడ్డి కొనుగోళ్లను ప్రారంభించి మాట్లాడారు. రైతుల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పాటుపడుతోందన్నారు. రైతులు మార్కెట్ బయట దళారులకు మిర్చి అమ్ముకుని మోసపోవద్దన్నారు. మార్కెట్‌లోనే మిర్చిని అమ్ముకొని గిట్టుబాటు ధర పొందాలని అన్నారు. కాగా మార్కెట్‌కు 142 క్వింటాళ్ల తేజ రకం మిర్చి అమ్మకానికి రాగా, క్వింటాకు గరిష్ట ధర రూ.14,250, కనిష్ట ధర రూ.10,088 పలికింది. అలాగే 18 క్వింటాళ్ల తాలు రకం మిర్చి అమ్మకానికి రాగా క్వింటాకు గరిష్ట ధర రూ.6,626, కనిష్ట ధర రూ.5,889 పలికినట్లు మార్కెట్ అధికారులు తెలిపారు. మార్కెట్ డైరెక్టర్లు వసంతరావు, అయూబ్‌ఖాన్, అధికారులు, వ్యాపారులు, రైతులు ఉన్నారు.

ఉన్నతాధికారులకు నివేదిస్తాం

- కబ్జా చేస్తే చర్యలు తప్పవు
- ఆర్‌డీఎంఏ మసూద్

మహబూబాబాద్: గ్రీన్‌ల్యాండ్‌ల కబ్జాలు, అక్రమ నిర్మాణాలు, ఇతర కబ్జాలపై విచారణ జరిపి సీడీఎంఏకు నివేదిక అందజేస్తామని ఆర్‌డీఎంఏ మసూద్ అన్నారు. జిల్లా కేంద్రంలో నిర్మాణంలో ఉన్న మున్సిపల్ కార్యాలయ భవనాన్ని పరిశీలించారు.గ్రీన్‌ల్యాండ్‌లు, మున్సిపల్ స్థలాల కబ్జా, అక్రమ నిర్మాణాలపై పలువురు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు ఆ స్థలాలను పరిశీలించారు. అనంతరం సయ్యద్ మసూద్ మాట్లాడుతూ.. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడితే కూల్చివేతలు తప్పవని హెచ్చరించారు. రజాలిపేట గ్రామంలో ప్రభుత్వ స్థలానికి ఫెన్సింగ్ చేసినా కబ్జాకు ప్రయత్నాలు చేస్తున్నట్లు ఫిర్యాదులు వచ్చాయన్నారు. మున్సిపాలిటీ స్థలాలు, గ్రీన్‌ల్యాండ్‌ల పరిరక్షణ విషయంలో అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. సీడీఎంఏ నుంచి ఆదేశాలు రాగానే చర్యలు తీసుకుంటామన్నారు. కాగా జిల్లా కేంద్రంలోని చెరువుల ఎఫ్‌టీఎల్‌లో అక్రమ నిర్మాణాలు జరిగాయని, అక్రమారులపై చర్యలు తీసుకోవాలని బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి దార్ల శివరాజ్ ఆధ్వర్యంలో ఆర్‌డీఎంఏ మసూద్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలోమున్సిపల్ కమిషనర్ నోముల రవీందర్, డీఈ ఉపేందర్, టీపీఓ సాయిరాం, టీపీఎస్ ప్రవీణ్ ఉన్నారు.



వివరాలు తెలుసుకుంటున్న ఆర్‌డీఎంఏ

ఆరోగ్యంపై అవగాహన కల్పించాలి

- డీఎంహెచ్‌ఓ మురళీధర్

నెహ్రూసెంటర్: ఆరోగ్య కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌ఓ మురళీధర్ అన్నారు. జిల్లా కేంద్రంలో ఆశ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలకు ప్రజారోగ్యం– ఎదుర్కొవాల్సిన సవాళ్లపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ... అయోడిన్ లోపంతో అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని పేర్కొన్నారు. అయోడిన్ లోపం కారణంగా గర్భిణులు, పిల్లల ఆరోగ్యం ఆందోళన కలిగిస్తుందని పేర్కొన్నారు. పోషకాలు అధికంగా ఉండే చేపలు, గుడ్లు, మాంసం, పాల ఉత్పత్తులు ఎక్కువగా తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ సారంగం, డాక్టర్ మురళీనాయక్, డాక్టర్ శ్రవణ్‌కుమార్, డిప్యూటీ మాస్ మీడియా అధికారి కొప్పు ప్రసాద్, హెచ్ఈ రాజు, ఎస్‌యూఓ రామకృష్ణ, జిల్లా కోఆర్డినేటర్ ప్రభాకర్, ఔట్ రీచ్ వర్కర్ మంజుల, కవిత, సునీత, క్రాంతికుమార్, సరస్వతి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ మురళీధర్

ప్రైవేట్ ఆస్పత్రుల తనిఖీ..

జిల్లా కేంద్రంలోని శ్రీసత్యసాయి ఆస్పత్రి, నిఖ్మ హెల్త్‌కేర్ ఆస్పత్రులను డీఎంహెచ్‌ఓ సోమవారం తనిఖీ చేశారు. శ్రీ సత్యసాయి ఆస్పత్రి నిర్వహణ, అపరిశుభ్రతగా ఉండటం, నిఖ్మ ఆస్పత్రి రికార్డులు సక్రమంగా లేనందున ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆస్పత్రులకు నోటీసులు జారీ చేశారు. స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణ పరీక్ష చేయొద్దని, గర్భిణులకు అనుమతి పొందిన రేడియాలజిస్టులే స్కానింగ్ చేయాలని సూచించారు. ఆస్పత్రుల్లో ఫైర్‌సేఫ్టీ, ధరల పట్టికలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

శునకాల స్వైరవిహారం!

- మానుకోట పట్టణంలో కుక్కల సంచారం
- వాహనాల వెంట పరుగులు తీస్తున్న వైనం
- భయాందోళనకు గురవుతున్న ప్రజలు

నెహ్రూసెంటర్: జిల్లా కేంద్రంలో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. గుంపులుగా సంచరిస్తూ ప్రజలు, వాహనదారులు ఆందోళనకు గురి చేస్తున్నాయి. కాగా పట్టణంలో పలు చోట్ల పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు కుక్కకాటుకు గురవుతున్నారు. దీంతో పాటు వాహనాలపై వెళ్లే వారిని శనకాలు వెంబడించడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. వీధులు, రోడ్లపై గుంపులుగా తిరుగుతుండడంతో ఒంటరిగా వెళ్లేందుకు ప్రజలు జంకుతున్నారు. వీధుల్లో తిరుగుతన్న కుక్కలకు వ్యాక్సిన్లు వేయించాలని, బర్త్ కంట్రోల్ ఆపరేషన్ చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

వాహనాల వెంట పరుగులు...

జిల్లా కేంద్రంలో కలెక్టరేట్ రోడ్డులోని కురవి గేట్, బంధం రోడ్డు, రెడ్డి బజారులో చీకటి పడితే చాలు వాహనాలు, సైకిల్‌పై వెళ్లే వారి వెంట కుక్కలు పరుగులు పెడుతూ భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. అటువైపుగా ఒంటరిగా వెళ్లలేని పరిస్థితులు నెలకొన్నాయి. అధికారులు వెంటనే ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి శునకాలను ప్రత్యేక స్థలాలకు పంపించేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.



గుంపులుగా తిరుగుతున్న శునకాలు

బర్త్ కంట్రోల్ చేయాలి



కుక్కలతో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నాం. పిల్లలు, పెద్దలు అనే తేడా లేకుండా భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. శునకాలకు బర్త్ కంట్రోల్ ఆపరేషన్ చేయించాలి. కుక్కలతో పాటు కోతుల సమస్యల కూడా తీవ్రంగా ఉంది. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

- చారి హరీశ్

కాళేశ్వర దేవస్థానం ఈఓగా మహేష్ బాధ్యతలు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం దేవస్థానం గ్రేడ్–1 ఈఓగా శనిగల మహేష్ బాధ్యతలు తీసుకున్నారు. సోమవారం ఆయన కాళేశ్వరం దేవస్థానంలోని ఈఓ కార్యాలయంలో బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ పనిచేస్తున్న ఈఓ ఎడవల్లి మారుతి కరీంనగర్ జిల్లా మానకొండూర్‌లోని గట్టుదుద్దనపల్లి ఆంజనేయస్వామి ఆలయానికి బదిలీపై వెళ్లిన విషయం తెలిసిందే. ఈఓ మారుతి ఆదివారం రిలీవ్ అయి వెళ్లిపోయారు. బాధ్యతలు తీసుకున్న అనంతరం ఈఓ మహేష్ వచ్చే నెల ఫిబ్రవరి 7, 8, 9 తేదీల్లో దేవస్థానంలో కుంభాభిషేకం నిర్వహిస్తున్న నేపథ్యంలో వేదపండితులకు ఆహ్వానం అందజేయడానికి ఆసిఫాబాద్ జిల్లా అచ్చెలాపురం వెళ్లారు. ఆయన వెంట సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఉపప్రధాన అర్చకులు ఫణీంద్ర శర్మ వెళ్లారు.



వినతులు వెంటనే పరిష్కరించాలి

- అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో
- ప్రజావాణిలో 165 అర్జీల స్వీకరణ

మహబూబాబాద్: ప్రజావాణి వినతులను పరిశీలించి సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో అన్నారు. కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించగా అదనపు కలెక్టర్లు లెనిన్ వత్సల్ టొప్పో, వీరబ్రహ్మచారి వినతులు స్వీకరించారు. ఈసందర్భంగా లెనిన్ వత్సల్ టొప్పో మాట్లాడుతూ.. అధికారులు వారి పరిధిని బట్టి వినతులను వెంటనే పరిష్కరించాలని, లేని యెడల కారణాలతో కూడిన నివేదిక అందజేయాలన్నారు. పెండింగ్ వినతులను కూడా త్వరగా పరిష్కరించాలన్నారు . సత్వర పరిష్కారం కోసమే ప్రజావాణి అనే విషయాన్ని అధికారులు గుర్తుపెట్టుకుని వినతులను పరిష్కరించాలన్నారు. ప్రజావాణిలో 165 వినతులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో డీసీఓ వెంకటేశ్వర్లు, సీపీఓ సుబ్బారావు, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ నర్సింహస్వామి, డీసీఎస్ఓ ప్రేమ్‌కుమార్, సివిల్ సప్లయీస్ డీఎం కృష్ణవేణి, ఏడీఎం సత్యనారాయణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్లు లెనిన్ వత్సల్ టొప్పో, వీర బ్రహ్మచారి

వచ్చిన వినతుల్లో కొన్ని...

- కేసముద్రం మండలం తౌర్యతండాకు చెందిన కారోబార్ వాంకుడోతు గణేష్ ఎనిమిది నెలలుగా వేతనం రావడం లేదని, కుటుంబ పోషణ కష్టంగా ఉందని వేతనం ఇప్పించాలని వినతి ఇచ్చారు.
- గార్ల మండలం సీతంపేటకు చెందిన జి.రాజు తన అన్న మహేశ్ మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తూ ఈ మధ్యకాలంలో మృతి చెందాడని, ఆ ఉద్యోగం తనకు ఇప్పించాలని వినతిలో కోరాడు.
- మానుకోట మున్సిపాలిటీ పరిధి బేతోలు గ్రామానికి చెందిన ఖాదర్ బాబా, సంతోష్ గ్రామంలో 15 సంవత్సరాల క్రితం పీహెచ్‌సీ భవన నిర్మాణం చేపట్టారని, నేటికీ పూర్తి కాలేదన్నారు. ప్రస్తుతం పీహెచ్‌సీ అద్దె భవనంలో నిర్వహిస్తున్నారని అది కూడా శిథిలావస్థలో ఉందని వెంటనే భవన నిర్మాణ పనులు పూర్తి చేయాలని వినతి అందజేశారు.

పింఛన్ ఇప్పించాలి



ఆరు నెలల నుంచి పింఛన్ రావడం లేదు. సంబంధిత అధికారుల వద్దకు వెళ్లినా పట్టించుకోవడం లేదు. కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణిలోనే మూడుసార్లు వినతి ఇచ్చినా పట్టించుకోలేదు. వెంటనే పింఛన్ మంజూరు చేయాలి.

- ఎం.లచ్చయ్య, దివ్యాంగుడు, గిరిపురం, మరిపెడ

నా కుమారులకు ఉపాధి కల్పించాలి



నాకు ఉన్న మూడెకరాల భూమిని గ్రామంలోని ఏకలవ్య పాఠశాల కోసం తీసుకున్నారు. అందుకు నా కుమారులు శివ, వెంకటేష్‌కు అవుట్ సోర్సింగ్‌లో కిచెన్ హెల్పర్ ఉద్యోగాలు ఇచ్చారు. పెద్దపెద్ద గిన్నెలు మోయడంతో వారి వెన్నుముకలు దెబ్బతిని అనారోగ్యానికి గురయ్యారు. ఏడాదిగా డ్యూటీకి వెళ్లడం లేదు. ఆపాఠశాలలో వేరే ఉద్యోగాలు ఇచ్చి ఆదుకోవాలి.

- బి. పూలమ్మ, నామాలపాడు, బయ్యారం

వైభవంగా శివకల్యాణం



శివకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

హన్మకొండ కల్చరల్ : శ్రీరుద్రేశ్వరస్వామి వేయిస్తంభాల ఆలయంలో సోమవారం పుష్యమాసం బహుళ త్రయోదశి సందర్భంగా వేదపండితులు, అర్చకులు శివకల్యాణం జరిపించారు. గణపతి ఆరాధన, రుద్రేశ్వర స్వామివారికి లఘున్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. అలాగే మాసశివరాత్రి కావడంతో ఆలయ నాట్యమండపంలో రుద్రేశ్వరి, రుద్రేశ్వర స్వామి వారికి వైభవంగా కల్యాణం చేశారు. ఫిబ్రవరి 26వ తేదీన దేవాలయంలో జరిగే మహాశివరాత్రి ఉత్సవాల నిర్వహణకు జీఎంఆర్ గ్రూప్స్ అధినేత రూ.లక్ష చెక్కును దేవాలయ ఈఓ వెంకటయ్యకు అందజేశారు. అలాగే స్వామివారి అలంకరణ కోసం 108రుద్రాక్షల వెండితో అల్లించిన దండను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

- డీసీహెచ్ఎస్ వెంకట్రామ్‌లు

గూడూరు: రోగులకు వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీసీహెచ్ఎస్ వెంకట్రామ్‌లు అన్నారు. మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను సోమవారం ఆయన తనిఖీ చేశారు. శనివారం రాత్రి నర్సు సరళపై డాక్టర్ సునీత చేయిచేసుకున్న విషయంపై, ఆదివారం విధుల్లో ఉండాల్సిన డాక్టర్ నవత సాయంత్రం నర్సంపేటలోని తన ప్రైవేట్ ఆస్పత్రిలో విధులకు వెళ్లడం, ఆ సమయంలోనే పురుగుల మందు తాగి ప్రమాదకర పరిస్థితుల్లో వచ్చిన ఓ వ్యక్తికి కేర్ టేకర్ చికిత్స అందించిన విషయంపై వచ్చిన ఫిర్యాదు మేరకు ఉన్నతాధికారుల ఆదేశం మేరకు విచారణ జరుపుతున్నట్లు తెలిపారు. సీహెచ్‌సీలో వైద్యుల హాజరు రిజిస్టర్‌ను పరిశీలించి, రోగులు, ఇతర సిబ్బందితో సమస్యలు, వైద్యుల సేవలపై ఆరా తీశారు. అనంతరం తన విచారణలో ఆ రెండు సంఘటనలపై సేకరించిన అంశాల విషయంలో తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్‌కు, కలెక్టర్‌కు నివేదిక పంపిస్తామని, తదుపరి వారిపై చర్యలు ఉంటాయన్నారు.



వైద్యులతో మాట్లాడుతున్న డీసీహెచ్ఎస్

మున్సిపల్ కార్మికుల వేతనాలు పెంచాలి

తొర్రూరు: పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుతున్న మున్సిపల్ కార్మికుల వేతనాలు పెంచాలని టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి రవి అన్నారు. మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ టీయూసీఐ ఆధ్వర్యంలో సోమవారం డివిజన్ కేంద్రంలోని మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కమిషనర్ శాంతికుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు అందించాలన్నారు. వేతనాలపై సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయాలన్నారు. నాయకులు రామస్వామి, కుమార్, ఉప్పలయ్య, చంద్రమ్మ, శివ, నరసింహ, సోమయ్య పాల్గొన్నారు.



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

క్లుప్తంగా

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి


సురేశ్‌(ఫైల్‌)

భూపాలపల్లి అర్బన్‌ : అనుమానాస్పద స్థితిలో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన మున్సిపాలిటీ పరిధిలోని కాశీంపల్లి శివారు బాలాజీనగర్‌ కాలనీలో సోమవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. మృతుడి తల్లి కందుల సుగుణ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. సుగుణ కొడుకు కందుల సురేశ్‌ (37) కాశీంపల్లిలో ఆదివారం రాత్రి నిర్వహించిన కబడ్డీ పోటీలు చూడడానికి వెళ్లి రాత్రి 9 గంటలకు ఇంటికి చేరుకుని ఇంటి ముందు పడుకున్నాడు. తెల్లవారుజామున 5 గంటలకు చూసేసరికి మృతి చెందినట్లు తెలిపారు. ఎవరో రాత్రి సమయంలో హత్య చేసి ఎవరికి అనుమానం రాకుండా మంచంమీద పడుకోబెట్టి వెళ్లారని విలపిస్తూ తెలిపింది. పథకం ప్రకారమే ఇద్దరు వ్యక్తులు కలిసి తన కొడుకును హత్య చేసి ఉంటారని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. మృతుడి నడుం భాగంలో గాయాలు కనిపించడంతో పక్కాగా ఇద్దరు కలిసి హత్య చేసి ఉంటారని తల్లి అనుమానాన్ని వ్యక్తం చేసింది. మృతుడు లారీడ్రైవర్‌ కాగా అతనికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నరేశ్‌ కుమార్‌ తెలిపారు.

పట్టపగలే ఇంట్లో చోరీ



కేసముద్రం: పట్టపగలే ఓ ఇంట్లో చోరీ జరిగిన సంఘటన మండలంలోని అన్నారంలో సోమవారం చోటుచేసుకుంది. బాధితుల కథనం ప్రకారం..గ్రామానికి చెందిన యాకూబ్‌ తన కుటుంబ సభ్యులతో కలిసి ఎప్పటిలాగే ఇంటికి తాళం వేసి కూలీ పనికి వెళ్లారు. ఈ క్రమంలో మధ్యాహ్నం గుర్తుతెలియని వ్యక్తులు ఆ ఇంటితాళం పగులగొట్టి లోపలికి ప్రవేశించారు. ఇంట్లోకి ఉన్న అర తులం బంగారు, వెండి ఆభరణాలు, రూ.6వేల నగదు అపహరించుకెళ్లారు. సాయంత్రం ఇంటికి వచ్చాక తాళం పగులగొట్టి ఉండడంతో చోరీ జరిగినట్లు గుర్తించారు. ఈ విషయంపై ఎస్సై మురళీధర్‌రాజును వివరణ కోరగా చోరీ ఘటన విషయం తమ దృష్టికి రాలేదన్నారు. దీనిపై విచారణ జరపనున్నట్లు ఆయన తెలిపారు.



కూలీ పనికి వెళ్లి వస్తూ.. రోడ్డు ప్రమాదానికి గురై

గూడూరు-అంబాల మధ్య ఆర్టీసీ బస్సు, టాటా ట్రాలీ ఢీ..
- 13 మందికి తీవ్ర గాయాలు
- ఇందులో చికిత్స పొందుతూ ఒకరు మృతి
- డ్రైవర్‌ పరిస్థితి విషమం

కమలాపూర్‌/హసన్‌పర్తి: ఆ బస్తీలో సుమారు 40 ఇళ్లు ఉన్నాయి. వీరందరూ నిరుపేదలు. బండకొట్టడం వీరి ప్రధాన వృత్తి. ఇక్కడ పురుషులతోపాటు మహిళలు కూడా కూలీ పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటారు. ప్రస్తుతం స్థానికంగా ఉపాధి లేకపోవడంతో చుట్టు పక్కల గ్రామాలకు వెళ్లి పనులు చేస్తున్నారు. రోజూ మాదిరిగానే సోమవారం కూడా మరో ప్రాంతానికి వెళ్లారు. పనులు ముగిసిన అనంతరం టాటా ట్రాలీలో ఇంటికి బయలుదేరారు. మార్గమధ్యలో ఆర్టీసీ బస్సు, ట్రాలీ ఢీకొన్నాయి. ఈ ఘటనలో 13 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఇందులో ఓ మహిళా కూలీ మృతి చెందింది. ట్రాలీ డ్రైవర్‌ పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన సోమవారం హనుమకొండ జిల్లా కమలాపూర్‌ మండలంలోని గూడూరు-అంబాల గ్రామాల మధ్యలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం మునిపల్లికి చెందిన సుమారు 24 మంది కూలీలు కమలాపూర్‌ మండలం వంగపల్లికి వ్యవసాయ పనికి వచ్చారు. పని ముగించుకుని మధ్యాహ్నం టాటా ట్రాలీలో మునిపల్లి వెళ్తున్నారు. ఈ క్రమంలో ట్రాలీ గూడూరు-అంబాల గ్రామాల మధ్యలో ఓ ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొని బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ట్రాలీలో ప్రయాణిస్తున్న 13 మంది కూలీలు తీవ్రంగా, మిగతా వారు స్వల్పంగా గాయపడ్డారు.



బస్సును ఢీకొని బోల్తా పడిన ట్రాలీ, ఘటనాస్థలిలో క్షతగాత్రులు


హుస్సేన్‌బీ (ఫైల్‌)

సమాచారం అందుకున్న కమలాపూర్‌ సీఐ హరికృష్ణ సిబ్బందితో హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకుని క్షతగాత్రులందరినీ 108 వాహనాల ద్వారా వరంగల్‌ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మహిళా కూలీ హుస్సేన్‌బీ (45) మృతి చెందగా, ట్రాలీ డ్రైవర్‌ అబ్దుల్లా పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. తీవ్రంగా గాయపడిన వారిలో సమీనాబీ, యాకూబ్‌పాషా, స్వల్పంగా గాయపడిన వారిలో కరీమా, ముంతాజ్‌ బేగం, యాకూబ్‌బీ, ఆశ, రంజాన్‌, గౌసియా, హుస్సేన్‌ బీ, కరీంబీ ఉన్నారు. కాగా, సమాచారం అందుకున్న కాజీపేట ఏసీపీ తిరుమల్‌ ఘటనా స్థలిని పరిశీలించి ప్రమాద వివరాలు తెలుసుకున్నారు. ఈ ఘటనపై ఆర్టీసీ బస్సు డ్రైవర్‌ బొట్ల మహేందర్‌ ఫిర్యాదు మేరకు ట్రాలీ డ్రైవర్‌ అబ్దుల్లాపై కేసు నమోదు చేసినట్లు సీఐ హరికృష్ణ తెలిపారు.

క్షతగాత్రులను పరామర్శించిన ఎమ్మెల్యే

కాగా, రోడ్డు ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులను వర్ధన్నపేట ఎమ్మెల్యే కే.ఆర్‌.నాగరాజు ఎంజీఎంలో పరామర్శించారు. ఈ సందర్భంగా ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు. మృతురాలి కుటుంబానికి రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. ఎమ్మెల్యే వెంట పీఏసీఎస్‌ చైర్మన్‌ ఉదయ్‌కుమార్‌రెడ్డి, కాంగ్రెస్‌ సీనియర్‌ నాయకులు ఎ.శ్రీనివాస్‌, స్వరూప ఉన్నారు.



నెరవేరనున్న 40 ఏళ్ల కల..!

- కాజీపేట బస్టాండ్‌ నిర్మాణానికి అడుగులు
- నేడు కలెక్టర్‌, ఆర్డీఓ, రైల్వే అధికారుల బృందం జాయింట్‌ ఇన్‌స్పెక్షన్‌ విజిట్‌

కాజీపేట రూరల్‌ : పట్టణ ప్రజల చిరకాల కోరిక కాజీపేట బస్టాండ్‌ కల త్వరలో నెరవేరబోతుంది. వరంగల్‌ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి కృషి, పట్టుదలతో 40 ఏళ్ల బస్టాండ్‌ సమస్య పరిష్కారానికి శ్రీకారం చుట్టారు. కాజీపేట బస్టాండ్‌, కాజీపేట రైల్వే డివిజన్‌, బోడగుట్ట ఫుట్‌ఓవర్‌ బ్రిడ్జి, కాజీపేట స్టేషన్‌ సమీపాన రోడ్డు అండర్‌బ్రిడ్జి, ఇతర దీర్ఘకాలిక పెండింగ్‌ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ దక్షిణ మధ్య రైల్వే జనరల్‌ మేనేజర్‌ అరుణ్‌కుమార్‌ జైన్‌, డిప్యూటీ జనరల్‌ మేనేజర్‌ ఉదయ్‌నాథ్‌ కోట్లను వరంగల్‌ ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కడియం శ్రీహరి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య కోరారు. ఈ మేరకు సికింద్రాబాద్‌లోని రైల్‌ నిలయంలో రైల్వే జీఎం అరుణ్‌కుమార్‌ జైన్‌ను కలిసి పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. దీనిపై రైల్వే జీఎం సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి తెలిపారు. బస్టాండ్‌ కోసం ఎకరం భూమిని లీజ్‌ లేదా, రైల్వే భూమి ఇస్తే ప్రభుత్వ భూమి ఇవ్వడం, లేదంటే ప్రభుత్వ ధర ప్రకారం భూమి ఇవ్వాలని జీఎంను కోరామన్నారు. ఈ క్రమంలో మంగళవారం మధ్యాహ్నం కలెక్టర్‌ ప్రావీణ్య, జిల్లా అధికారులు, రైల్వే అధికారుల బృందం కాజీపేట జంక్షన్‌లో రైల్వే సంఘ్‌ కార్యాలయం సమీపం నుంచి బ్రిడ్జి వైపు రైల్వే క్వార్టర్స్‌ స్థలాన్ని జాయింట్‌ ఇన్‌స్పెక్షన్‌ విజిట్‌ చేయనున్నట్లు తెలిపారు. ఫాతిమా బ్రిడ్జి నిర్మాణం ఏప్రిల్‌లో పూర్తి చేయనున్నట్లు పేర్కొన్నారు. కాజీపేట బస్టాండ్‌ ల్యాండ్‌ ఫైనల్‌ కావడంతో పనులు ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఫాతిమా బ్రిడ్జి ప్రారంభం, కాజీపేట బస్టాండ్‌ నిర్మాణ పనులను ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా జరిపిస్తామన్నారు. అలాగే, కాజీపేట చిరకాల వాంఛ కాజీపేట డిగ్రీ కాలేజీ, కాజీపేట ప్రభుత్వ ఆసుపత్రి మంజూరును ముఖ్యమంత్రితో అనౌన్స్‌మెంట్‌ చేయించాలన్నదే తన కల అని ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి తెలిపారు.


రైల్వే జీఎం ఏకే జైన్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ

42 శాతం రిజర్వేషన్ల హామీ ఏమైంది


హలో ముదిరాజ్‌..చలో వరంగల్‌ పోస్టర్‌ ఆవిష్కరిస్తున్న శాసనమండలి డిప్యూటీ చైర్మన్‌ బండా ప్రకాశ్‌

- శాసనమండలి డిప్యూటీ చైర్మన్‌ బండా ప్రకాశ్‌

హన్మకొండ: బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని కాంగ్రెస్‌ పార్టీ హామీ ఇచ్చి ఏడాదైనా హామీపై ఇప్పటికీ స్పష్టత లేదని శాసనమండలి డిప్యూటీ చైర్మన్‌ డాక్టర్‌ బండా ప్రకాశ్‌ అన్నారు. సోమవారం హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముందుగా బీసీ కమిషన్‌ వేశారని దీనిపై కోర్టుకు వెళ్లడంతో కోర్టు ఆదేశానుసారం, బీసీల డిమాండ్‌తో డెడికేటెడ్‌ కమిషన్‌ వేశారన్నారు. అయినా ఇప్పటి వరకు రిజర్వేషన్లపై స్పష్టత లేదని విమర్శించారు. కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయకపోవడానికి ప్రతిపక్షంలో ఉన్న పార్టీ, అధికారంలో ఉన్న పార్టీయే కారణమన్నారు. బీసీలకు రాజకీయ పార్టీలు జనాభా దామాషా ప్రకారం అవకాశాలు కల్పించాలన్నారు. ఈసారైనా బీసీ కులగణన చేయాలన్నారు. ఉద్యమాలు, పోరాటాల ద్వారానే హక్కులు సాధించుకోగలుగుతామన్నారు. హనుమకొండలో ఫిబ్రవరి 2న జరిగే బీసీ రాజకీయ యుద్ధభేరి మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా హలో ముదిరాజ్‌.. చలో వరంగల్‌ పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్‌ మహాసభ ప్రధాన కార్యదర్శి పల్లెబోయిన అశోక్‌, గ్రేటర్‌ వరంగల్‌ అధ్యక్షుడు బయ్యా స్వామి, ప్రధాన కార్యదర్శి పులి రజనీకాంత్‌, భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు జోరిక సదయ్య, జనగామ జిల్లా అధ్యక్షుడు నీల గట్టయ్య, మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు పిట్టల శ్రీలత, నాయకులు చొప్పరి సోమయ్య, నీల రాజు, రాజకుమార్‌, దువ్వ నవీన్‌, పులి విక్రమ్‌, దువ్వ కనకరాజ్‌, పిట్టల సత్యనారాయణ, మహేందర్‌, బండి సతీశ్‌, ఉమాదేవి, అనురాధ, కిరణ్‌, రవి కుమార్‌, రమేశ్‌, తదితరులు పాల్గొన్నారు.

లారీని ఢీకొట్టి ఆటో బోల్తా

- డ్రైవర్‌కు గాయాలు
- ఘటన ప్రదేశంలోనే మరో ఘటన

ఖిలా వరంగల్‌ : వరంగల్‌-ఖమ్మం హైవే మామునూరు టీజీఎస్పీ పెట్రోల్‌బంక్‌ స్పీడ్‌ బ్రేకర్‌ వద్ద లారీ ప్రమాదంలో నలుగురు మృతి చెందిన విషయం తెలిసిందే. అయితే ఆదివారం అర్ధరాత్రి అదే ప్రదేశంలో మరో రోడ్డు ప్రమాదం సంభవించింది. వరంగల్‌ నుంచి వర్ధన్నపేట వైపునకు వెళ్తున్న ఆటో ఆకస్మాత్తుగా అదుపు తప్పి లారీని ఢీకొట్టి ఎదురుగా వచ్చే కారును ఢీకొని రోడ్డుపై అడ్డంగా బోల్తా కొట్టింది. ఈ ఘటనలో డ్రైవర్‌కు తీవ్రగాయాలు కాగా ఓ ప్రయాణికుడు స్వల్పగాయాలతో బయటపడ్డాడు. స్థానికుల కథనం ప్రకారం.. వర్ధన్నపేట మండలం నల్లబెల్లి గ్రామానికి చెందిన నాగరాజు ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం అర్ధరాత్రి వరంగల్‌ నుంచి వర్ధన్నపేట వైపునకు ప్రయాణికుడిని ఆటోలో ఎక్కించుకొని బయలుదేరాడు.


హైవేపై బోల్తా పడిన ఆటో

ఈ క్రమంలో నలుగురు మృతిచెందిన ఘటనాస్థలికి రాగానే ఒక్కసారిగా ఆటో అదుపుతప్పి లారీ, కారును ఢీకొడుతూ బోల్తా పడింది. గాయపడిన డ్రైవర్‌తో పాట ప్రయాణికుడిని స్థానికులు 108లో వరంగల్‌ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అనంతరం పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని రోడ్డుపై అడ్డుగా బోల్తా పడిన ఆటోను తొలగించి ట్రాఫిక్‌ క్లియర్‌ చేశారు.

బైక్‌ను ఢీకొన్న లారీ..

- వ్యక్తి మృతి
- కోతులనడుమ బ్రిడ్జిపై ఘటన


రాజేశ్వర్‌రావు (ఫైల్‌)

ఎల్కతుర్తి : ద్విచక్రవాహనాన్ని లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన సోమవారం ఎల్కతుర్తి మండలం కోతులనడుమ బ్రిడ్జిపై జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని సూరారం గ్రామానికి చెందిన బచ్చు రాజేశ్వర్‌రావు(52) ద్విచక్రవాహనంపై కరీంనగర్‌ జిల్లా హుజూరాబాద్‌ వెళ్లాడు. తిరిగి స్వగ్రామం వస్తున్న క్రమంలో మార్గమధ్యలోని కోతులనడుమ బ్రిడ్జిపై ఎల్కతుర్తి నుంచి హుజూరాబాద్‌ వైపునకు వెళ్తున్న లారీ ఢీకొంది. దీంతో రాజేశ్వర్‌రావుకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్‌ తెలిపారు.

వేసవిలో నాణ్యమైన విద్యుత్‌

- ఇప్పటికే సమ్మర్‌ యాక్షన్‌ ప్లాన్‌ ఖరారు
- 29న నోడల్‌ ఆఫీసర్ల సమీక్ష



హన్మకొండ: వేసవిలో నాణ్యమైన విద్యుత్‌ సరఫరాకు టీజీ ఎన్పీడీసీఎల్‌ యాజమాన్యం ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంది. ఇటీవల రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, విద్యుత్‌శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క విద్యుత్‌ సంస్థల సీఎండీలు, అధికారులతో సమ్మర్‌ యాక్షన్‌ ప్లాన్‌పై సమీక్ష నిర్వహించారు. వేసవిలో మెరుగైన, నాణ్యమైన విద్యుత్‌ అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ క్రమంలో టీజీ ఎన్పీడీసీఎల్‌ పరిధిలో ఈ నెల 29న అన్ని సర్కిళ్లలో సమీక్ష సమావేశాలు నిర్వహించాలని ఎన్పీడీసీఎల్‌ చైర్మన్‌, మేనేజింగ్‌ డైరెక్టర్‌ కర్నాటి వరుణ్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ఎన్పీడీసీఎల్‌లోని 16 సర్కిళ్లకు నోడల్‌ అధికారులుగా సీజీఎంలను నియమించారు. హనుమకొండ సర్కిల్‌ (జిల్లా)కు చీఫ్‌ జనరల్‌ మేనేజర్‌ (హెచ్‌ఆర్‌డీ) టి.మధుసూదన్‌, వరంగల్‌ సర్కిల్‌ (జిల్లా)కు చీఫ్‌ జనరల్‌ మేనేజర్‌ రాజు చౌహాన్‌ను నోడల్‌ ఆఫీసర్లుగా నియమించారు. వీరు బుధవారం ట్రాన్స్‌కో, ఎన్పీడీసీఎల్‌ అధికారులతో సర్కిల్‌ కార్యాలయాల్లో సమీక్ష నిర్వహిస్తారు. సమ్మర్‌ యాక్షన్‌ ప్లాన్‌లో చేపట్టిన పనులు, పూర్తయినవి, పురోగతిలో ఉన్న వాటిపై సమీక్షించి మిగతా పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోనున్నారు.

సమ్మక్క జాతరకు ఆహ్వానం


పీఓకు ఆహ్వానపత్రిక అందజేస్తున్న పూజారులు, ఆదివాసీ సంఘాలు

కన్నాయిగూడెం : మండలంలోని ఐలాపూర్‌ గ్రామంలో ఫిబ్రవరి 12, 13, 14 తేదీల్లో నిర్వహించే సమ్మక్క- సారలమ్మ జాతరకు ఏటూరునాగారం ఐటీడీఏ పీఓ చిత్ర మిశ్రాకు పూజారులు, ఆదివాసీ నాయకులు సంయుక్తంగా ఆహ్వానపత్రం అందజేశారు. పీఓను కలిసిన వారిలో పూజారుల సంఘం అధ్యక్షుడు మల్లెల రవి, పీరీల భాస్కర్‌, పులిష బాలు, తిరుపతి, సురేశ్‌, పోడెం బాబు, ఆలం రాంబాబు తదితరులు ఉన్నారు.

సంస్కృతీసంప్రదాయాలతో బోధన ఉండాలి

- త్రిదండి చినజీయర్‌ స్వామి


అతిథులకు సత్కారం చేస్తున్న జీయర్‌ స్వామి

జనగామ: దేశానికి స్వాతంత్య్రం వచ్చి ఏడున్నర దశాబ్దాలు గడిచినప్పటికీ మన సంస్కృతీసంప్రదాయాలు బోధించే విద్యా విధానం లేకపోవడం బాధాకరమని, ఇప్పటికైనా ఆ లోటును భర్తీ చేసి భవిష్యత్‌ తరాలకు మార్గదర్శకం కావాలని త్రిదండి చినజీయర్‌స్వామి కోరారు. పట్టణంలోని బాణాపురం వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ఆలయ ప్రధాన అర్చకుడు, యాదాద్రి దేవస్థానం ఆస్థాన సిద్ధాంతి తిరుమల నల్లాన్‌ చక్రవర్తుల సంపత్కుమార కృష్ణమాచార్య సిద్ధాంతి తండ్రి గోవిందాచార్య, గురువు త్రిపురారి రామకృష్ణ సిద్ధాంతి స్మృత్యర్థం నిర్వహించిన ఆచార్య పరివస్య కార్యక్రమంలో పాల్గొనేందుకు రెండు రోజుల పర్యటనలో భాగంగా జీయర్‌స్వామి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మిక రంగంలో కృష్ణమాచారి సిద్ధాంతి చేస్తున్న సేవలను అభినందించారు. పెద్దలను స్మరించడంతో పాటు సహచరులను సత్కరించి వారిని ప్రోత్సహించడం ప్రశంసనీయమన్నారు. అనంతరం శ్రీ వరహస్వామికి స్వర్ణ కిరీటదారణ చేసి, కాలవివేకం అనే పుస్తకాన్ని జీయర్‌స్వామి ఆవిష్కరించారు. కృష్ణమాచార్య సిద్ధాంతి మాట్లాడుతూ జీయర్‌స్వామి చేతుల మీదుగా వరాహస్వామికి స్వర్ణకిరీటం సమర్పణ చేయడం సంతోషకరమన్నారు. సోమవారం జీయర్‌స్వామికి ఘనంగా వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో ఆచార్యులు ఆకెళ్ల జయకృష్ణ, శ్రీనివాసాదిత్య, ఫణివరకుమార్‌, బట్టర్‌ సుందర ప్రహ్లాదచారి, తిరువెంగలాచారి, నరసింహరామ, గౌరీబట్ల సీతారామ సిద్ధాంతి, బ్రహ్మబట్ల శ్రీనాథ్‌, శ్రీనివాసాచార్య, గౌరిబట్ల సుబ్రహ్మణ్య శర్మ, ఓరుగంటి మనోహరాశర్మ, యోగేశ్వర, అమర వాది లక్ష్మణాచార్యులు, మరింగంటి రాఘవాచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

క్రమబద్ధీకరించాకే నియామకాలు చేపట్టాలి

- కాంట్రాక్టు అధ్యాపక కోఆర్డినేషన్‌ కమిటీ డిమాండ్‌


మాట్లాడుతున్న రాజేశ్‌ తదితరులు

కేయూ క్యాంపస్‌: రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో కాంట్రాక్టు అధ్యాపకులను క్రమబద్ధీకరించాకే రెగ్యులర్‌ అధ్యాపకుల నియామకాలు చేపట్టాలని కాకతీయ యూనివర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకుల కోఆర్డినేషన్‌ కమిటీ బాధ్యులు డాక్టర్‌ సాధురాజేశ్‌, డాక్టర్‌ బి. సతీశ్‌ డిమాండ్‌ చేశారు. సోమవారం కేయూలోని మహిళా ఇంజనీరింగ్‌ కళాశాల వద్ద నిర్వహించిన సమావేశం(గేట్‌మీటింగ్‌) వారు మాట్లాడారు. ఈనెల 26న హైదరాబాద్‌లోని అంబేడ్కర్‌ ఓపెన్‌ యూనివర్సిటీలో నిర్వహించిన కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని 12 యూనివర్సిటీలను బలోపేతం చేసేందుకు ఖాళీ అధ్యాపకుల పోస్టులను భర్తీచేస్తామని ప్రకటించడాన్ని తాము స్వాగతిస్తున్నామన్నారు. అయితే కొన్నేళ్లుగా యూనివర్సిటీల్లో కాంట్రాక్టు అధ్యాపకులుగా పనిచేస్తున్నవారికి న్యాయం చేయాలన్నారు. అందుకు అన్ని విద్యార్హతలు కలిగి ఉన్న కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్‌ చేయాలని డిమాండ్‌ చేశారు. గతంలో కేసీఆర్‌ ప్రభుత్వం యూనివర్సిటీలను నిర్వీర్యం చేసిందని విమర్శించారు. సమావేశంలో కమిటీ బాధ్యులు డాక్టర్‌ సత్యజూల, డాక్టర్‌ సీహెచ్‌ నాగేశ్వర్‌రావు, డాక్టర్‌ రఘువర్ధన్‌రెడ్డి, డాక్టర్‌ చంద్రశేఖర్‌, డాక్టర్‌ సూర్యనారాయణ, డాక్టర్‌ సతీశ్‌, డాక్టర్‌ బి. వెంకటగోపీనాథ్‌, రంజిత్‌, తూర్పాటి వెంకటేశ్‌, డాక్టర్‌ వీణ, వాణిశ్రీ, దీప్తి, స్వప్న, సాహితీ తదితరులు పాల్గొన్నారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

- తొడేళ్లగూడెంలో ఘటన
- తన మృతికి ముగ్గురు కారణమంటూ సెల్ఫీ వీడియో


సతీశ్‌(ఫైల్‌)

డోర్నకల్‌: ఓవ్యక్తితో గొడవలతోపాటు పోలీసు కేసు నమోదు కావడంతో మనస్తాపం చెందిన ఓ యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన డోర్నకల్‌ మండలం తొడేళ్లగూడెంలో చోటు చేసుకుంది. కుటుంబీకులు, గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పగడాల సతీశ్‌(30) ట్రాక్టర్‌ నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. గ్రామస్తుడు సుంకరి వెంకన్న, సతీశ్‌ మధ్య గొడవల జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో వెంకన్న కౌలుకు తీసుకున్న భూమి నుంచి ఈ నెల 21 సతీశ్‌ వెన్నారం వాగు నుంచి ఇసుక తరలించాడు. దీంతో వెంకన్న ఇసుక ట్రాక్టర్‌ను అడ్డుకున్నాడు. మరుసటి రోజు సతీశ్‌ తన ఇంటి సమీపంలో వెంకన్న ఇంటికి వెళ్లే రోడ్డుపై కంప అడ్డుగా పెట్టాడు. దీనిపై వెంకన్న ఫిర్యాదు మేరకు పోలీసులు సతీశ్‌పై ఈ నెల 24న కేసు నమోదు చేశారు. దీంతో వెంకన్నతో గొడవలు, పోలీస్‌ కేసు నమోదు కావడంతో మనస్తాపం చెందిన సతీశ్‌ ఆదివారం ముల్కలపల్లిలో పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అటువైపు వెళ్తున్న వారు చూసి కుటుంబీకులకు సమాచారం ఇవ్వగా సతీశ్‌ను ఖమ్మంలోని ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ అదేరోజు రాత్రి మృతి చెందాడు.

నా చావుకు ఆ ముగ్గురే కారణం..

తన చావుకు సుంకరి వెంకన్న, ఆయన కుమారులు చరణ్‌, పవన్‌ కారణమని పురుగుల మందు తాగడానికి ముందు సతీశ్‌ సెల్ఫీ వీడియో ద్వారా తెలిపాడు. ఇసుక రవాణాతో పాటు ఇతర కారణాలతో తనను ఇబ్బందులకు గురి చేశారన్నారు. తన చావుకు కారకులైన వారిపై చర్య తీసుకోవాలని కోరాడు. ఈ ఘటనపై మృతుడి తండ్రి జగన్నాథం ఫిర్యాదు మేరకు సీఐ రాజేశ్‌ సోమవారం విచారణ చేపట్టారు.

హత్యాయత్నం.. రోడ్డు ప్రమాదంగా

కేసు నీరుగార్చేందుకు కుట్ర..
- ప్రైవేట్‌ ఆస్పత్రి యాజమాన్యం నిర్వాకం
- నిందితులతో కుమ్మక్కయ్యారని ఆరోపణ
- న్యాయం చేయాలని బాధితుడి వేడుకోలు

హన్మకొండ చౌరస్తా: శత్రువుల దాడిలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రికి వచ్చిన బాధితుడికి వైద్యులు చికిత్స అందిస్తే.. రికార్డుల్లో మాత్రం రోడ్డు ప్రమాదంగా నమోదు చేసి కేసును నీరుగార్చే కుట్రకు పూనుకుంది ఓ ప్రైవేట్‌ ఆస్పత్రి యాజమాన్యం. తనకు జరిగిన అన్యాయంపై న్యాయస్థానంలో పోరాడుతున్న సదరు యువకుడు ఆస్పత్రి యాజమాన్యం ఇచ్చిన మెడికల్‌ రికార్డులను చూసి ఆందోళనకు గురయ్యాడు. యాజమాన్యాన్ని ప్రశ్నించగా బెదిరింపులే దిక్కయ్యాయి. బాధితుడు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హనుమకొండ జిల్లా వంగపహాడ్‌కు చెందిన శ్యాంరావు ప్రశాంత్‌కుమార్‌ 2022, జనవరి 20వ తేదీ రాత్రి 9 గంటలకు తన ఇంటి వద్ద ఉండగా కొందరు కర్రలు, ఇనుప రాడ్లతో దాడి చేశారు. తీవ్ర గాయాలతో ఉన్న అతడిని కుటుంబ సభ్యులు హనుమకొండలోని ఓ ప్రముఖ ప్రైవేట్‌ ఆస్పత్రికి(ఇటీవల పేరు మార్చారు) తీసుకొచ్చారు. వైద్యులు పరీక్షించి అత్యవసర చికిత్స అందించారు. తలపై 22కు పైగా కుట్లు వేయడంతో పాటు చేతి వేలు విరిగిపోగా సర్జరీ చేసి రాడ్డు వేశారు. మూడు రోజుల చికిత్స అనంతరం 24వ తేదీన ప్రశాంత్‌కుమార్‌ను డిశ్చార్జ్‌ చేశారు. మెరుగైన వైద్య కోసం అహ్మదాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో కొద్ది రోజులు చికిత్స పొంది కోలుకుని ఇంటికి చేరుకున్నాడు.

ఆస్పత్రి మాయాజాలం


బాధితుడు శ్యాంరావు ప్రశాంత్‌కుమార్‌

ప్రైవేట్‌ ఆస్పత్రిలో న్యూరో, ఆర్థో సర్జన్‌లు శస్త్ర చికిత్స చేసి వైద్యం అందించారు. ఆ సమయంలో ప్రశాంత్‌కుమార్‌ తనపై పది మంది దాడి చేశారని వారి పేర్లతో సహా తెలియజేశాడు. అతడి తండ్రి రఘు ఫిర్యాదు మేరకు హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్‌లో హత్యాయత్నం కేసు నమోదు చేయడంతో పాటు నిందితులను అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించారు. మూడేళ్ల తర్వాత కేసు తాజాగా తుది దశకు చేరుకుంది. ఈ సమయంలో కీలకమైన మెడికల్‌ రిపోర్టును చికిత్స అందించిన సదరు ఆస్పత్రి యాజమాన్యం హత్యాయత్నం కాదు రోడ్డు ప్రమాదంలో గాయపడి వచ్చిన ప్రశాంత్‌కుమార్‌ చికిత్స అందించినట్లు చిత్రీకరించింది. విషయం తెలుసుకున్న ప్రశాంత్‌కుమార్‌ తనకు జరిగిన అన్యాయంపై ఆస్పత్రి యాజమాన్యాన్ని ప్రశ్నించడంతో ముందు రాజీ కుదుర్చుకుందామన్నారు. వినకపోవడంతో బెదిరిస్తున్నారని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. నిందితులతో చేతులు కలిపి శిక్ష నుంచి తప్పించుకునేందుకు సహకరిస్తున్నారని ప్రశాంత్‌కుమార్‌ వాపోయాడు. ఈ విషయంపై డీఎంహెచ్‌ఓ అప్పయ్యకు ఫిర్యాదు చేశానని, నిందితులకు సహకరించిన ఆస్పత్రి యాజమాన్యంపై చర్యలు తీసుకోవడంతో పాటు తనకు న్యాయం చేయాలని కోరుతున్నాడు. ఈ విషయమై ఆ ప్రైవేట్‌ ఆస్పత్రి చైర్మన్‌, ఆర్‌ఎంఓలను వివరణ కోరేందుకు ఫోన్‌ చేయగా లిఫ్ట్‌ చేయలేదు.